

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

గూడూరులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు



గూడూరు, నవంబర్ 14, ప్రభాతవార్త మార్కెట్లో సన్న బియ్యం ధరలు ఇటీవల కాలంలో విపరీతంగా పెరగడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికా రులు గూడూరు పట్టణంలోని రెండు బియ్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు కిలో 66 రూపాయలు విక్ర యించాల్సిన బియ్యం 80 రూపాయలకు విక్రయిస్తున్న రెండు రైస్ ట్రేడర్స్ పై తనిఖీలు జరిపి తూనికలు కొలతల శాఖ అధికారుల సమన్వయంతో ఒక్కొక్కరికి 20 వేలు చొప్పున, 40 వేల రూపాయల అపరాధ రుసుం ను విధించారు. ఇదే విధానం మరోసారి పునరావృతం అయితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ సీఐ షేక్ సుభాని భాష, ఏవో వేణుగోపాలరావు, తూనికలు కొలతల శాఖ అధికారి బాబాసాహెబ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ని ఘన సత్కరించిన ఎమ్మెల్యే



కావలి, నవంబర్14, ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్. మాధవ్ శనివారం కావలి పట్టణానికి చేయడం జరిగింది. అనంతరం స్థానిక శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి నివాసానికి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌కి సాదర స్వాగతం పలికి పూల బొకే అందజేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం ఇరువురు నేతలు నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ అంశాలపై కాసేపు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, స్థానిక బీజేపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారికి అనుసంధానంగా సుందర ఐకాన్ నిర్మాణం



ఆత్మకూరు, నవంబరు14, ప్రభాతవార్త: నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారికి అనుసంధానంగా ఆత్మకూరు ప్రత్యేకతను చాటేలా సుందరమైన ఐకాన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆత్మకూరు బైపాస్ రోడ్డు ప్రారంభ ప్రాంతాన్ని శనివారం రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్వయంగా పరిశీలించారు. ఆత్మకూరు పట్టణానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చే విధంగా జాతీయ రహదారిపై సుందరమైన ఐకాన్ నిర్మాణానికి రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆత్మకూరు బైపాస్‌రోడ్డు ప్రారంభ ప్రాంతంలో సంబంధిత అధికారులతో కలిసి మంత్రి ఆనం స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన గావించారు. ఆత్మకూరు పట్టణ చారిత్రక ప్రాధాన్యతను, ప్రత్యేకతను ప్రతిబింబించేలా జాతీయ రహదారిపై ఆత్మకూరు పట్టణంలోకి ప్రయాణించే వారిని ఆకట్టుకునే విధంగా అత్యంత సుందరమైన ఐకాన్‌ను నిర్మించాలని అధికారులకు సూచించారు. ఆత్మకూరు పట్టణ సుందరీకరణలో భాగంగా ఈఐకాన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా నిర్మాణప్రణాళికలు రూపొందించాలని మంత్రి ఆనం అధికారులను ఆదేశించారు.

కావలిలో బీజేపీ జెండా ఎగురవేస్తాం

- మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి చైర్మన్ అభ్యర్థిని గెలిపించాలి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్




కావలి, నవంబర్14, ప్రభాతవార్త కావలి మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి చైర్మన్ అభ్యర్థిని గెలిపించి కావలిలో బిజెపి జెండాని ఎగురువేస్తామనిబీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. కావలి పట్టణంలోని ది హ్యాండ్లూమ్ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో శనివారం కావలి మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్.మాధవ్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.. నెల్లూరు జిల్లాలో బిజెపిని మరింత బలోపేతం చేసి జిల్లాను పార్టీకి కంచుకోటగా మారుస్తామని తెలియజేశారు.
కావలి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ చైర్మన్ అభ్యర్థిని గెలిపించి పార్టీకి విజయాన్ని అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తొలివిడతలో నెల్లూరు కార్పొరేషన్ మేయర్ సీటును బీజేపీకి కేటాయించాలని కోరామని, అయితే అది సాధ్యం కాలేదని తెలిపారు. కావలి మున్సిపల్ చైర్మన్ స్థానం బీజేపీకి కేటాయించి నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో తొలివిడతలో బీజేపీకి కేటాయించిన స్థానాలను పార్టీ కైవసం చేసుకుందని, అదే ఉత్సాహంతో కావలిలోనూ బీజేపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయకుండా వైసీపీకి ఓటు వేస్తే ఆ ఓటు వృథా అవుతుందని వ్యాఖ్యానించారు. కావలి పట్టణాన్ని కార్పొరేషన్ స్థాయి అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న నిధులు సద్వినియోగం కావాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కావలి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అత్యధిక మెజార్టీతో గెలిచి రాష్ట్రం మొత్తానికి మంచి సంకేతాన్ని ఇవ్వాలని కోరారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు విజయం సాధించడం జరిగిందని వారందరికీ అభినందనలు తెలియజేశారు. కావలిలో టిడిపి బలంగా ఉందని అదేవిధంగా జనసేన పార్టీ కూడా సహకరిస్తుందని అందరి సహకారంతో సమిష్టిగా పనిచేసే చైర్మన్ అభ్యర్థిని, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. మన జెండా ఎజెండా భారత ప్రధాని నరేంద్రమోడీ చేసిన అభివృద్ధిని తెలియజేశారు. బిజెపికి ఓటు వేస్తే మన ప్రాంతం వేగంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. కావలి పట్టణానికి లక్ష్మీదేవి రావాలని బిజెపి పార్టీ అఖండ విజయం సాధిస్తే నిధులు ఎక్కువ సమకూరి కావలి పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి విజయానికి కృషి చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. నూతనంగా బిజెపిలో చేరిన పసుపులేటి సుగుణమ్మను ఘనంగా సత్కరించడం జరిగింది. నెల్లూరు జిల్లాలో బీజేపీకి బలమైన పునాది ఉందని, రానున్న రోజుల్లో పార్టీని మరింత విస్తరించి జిల్లాను బీజేపీ అడ్డాగా మారుస్తామని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేంద్రరెడ్డి, రాష్ట్ర సంయుక్త కోశాధికారి, కందుకూరి వెంకట సత్యనారాయణ, ప్రకాశం జిల్లా ఇంచార్జ్ గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అంచిపాక కమల, జిల్లా సంయుక్త కోశాధికారి సివిసి సత్యం, రాష్ట్ర, జిల్లా, పట్టణ బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు







నెల్లూరు, నవంబర్ 14, ప్రభాతవార్త - వైద్యం నెల్లూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి అధ్యక్షతన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు బీద రవి చంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు, డీడీ మస్తాన్ రెడ్డి, కవి పెరుగు రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా జాతీయ పతాకాన్ని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి ఆవిష్కరించారు. అనంతరం గ్రంథాలయాన్ని సందర్శించారు. వారోత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో చిన్నారుల భరతనాట్యం ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్య అతిథులు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వల చేశారు. సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి అందరి చేత గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారికి సంస్థ చైర్ పర్సన్, సెక్రటరీ, గ్రంథాలయ సిబ్బంది సాధార స్వాగతం పలికారు. **ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర మాట్లాడుతూ** గ్రంథాలయాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, జిల్లాలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి జిల్లాలో ఉన్నటువంటి మంత్రులు శాసనసభ్యులు మేమందరం మా నిర్ణయాలు అధిష్టానం తెలియజేసినప్పటికీ సాక్షాత్తు ముఖ్యమంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంథాల సంస్థ చైర్ పర్సన్‌గా మేకపాటి శాంతి కుమారిని నియమించడం జరిగిందని, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుండి ఈ జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధి కోసం వారు నిరంతరం పనిచేస్తున్నారని, ఎక్కడ ఏ విషయం మీద కలిసిన వారు గ్రంథాలయం గురించి మాట్లాడతారని ఈ వారోత్సవాల సందర్భంగా మాటిస్తున్నాను జిల్లాలో ఉన్నటువంటి మంత్రి పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఇన్చార్జ్ మంత్రి ఎన్నండి ఫరూక్, పార్లమెంట్ సభ్యులు పేద మస్తాన్ రావు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రూరల్ శాసనసభలో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, జిల్లాలో ఉన్నటువంటి అందరు శాసనసభ్యులు కలుపుకొని జిల్లా కలెక్టర్‌తో కూడా మాట్లాడి ఈ జిల్లాలో ఉన్నటువంటి గ్రంథాలయాల అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తామని, త్వరలోనే పెండింగ్లో ఉన్నటువంటి జిల్లా కేంద్ర గ్రంథాలయ నూతన భవనాల పనులు పునః ప్రారంభించడానికి మంత్రి నారాయణ దృష్టిలో ఉందని తప్పనిసరిగా జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని నూతన భవనాలను నిర్మిస్తామని డిజిటల్ గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తామని ఈరోజు గ్రంథాల అభివృద్ధికి కష్టపడి పనిచేసే చైర్ పర్సన్ ఉన్నారు వారిని ఈ సందర్భంగా అభినందిస్తున్నాను అని తెలియజేశారు. నారా లోకేష్ బాబు కూడా ఈ శాఖకు సంబంధించిన మంత్రి వారు కూడా ప్రత్యేక దృష్టి పెట్టి ఉన్నారు అందులో భాగంగా వారి సొంత నియోజకవర్గమైన మంగళగిరిలో మోడల్ గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థులు నిరుద్యోగులు ప్రజలందరూ గ్రంథాలయాలను ఉపయోగించుకో వాలని తెలియజేశారు. **అదేవిధంగా రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ** విద్యార్థులందరూ జీవితంలో లో ఒక గోల్ నిర్ణయించుకొని అది సాధించడం కోసం కష్టపడి చదవాలని, ఆ కష్టపడే తరుణంలో మన కావాల్సినటువంటి అన్ని పుస్తకాలు అన్ని సౌకర్యాలు ఉండేటువంటి ఒక కేంద్రం గ్రంథాలయం అని, అలాంటి గ్రంథాలయ వారోత్సవాలకు నన్ను ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉంది అని తెలియజేశారు. తల్లిదండ్రులు విద్యార్థులతో సమయం గడపాలని, విద్యార్థులు జనరల్ నాలెడ్జ్‌ను పెంపొందించు కోవాలని, విద్యార్థులకు క్రీడలు,పుస్తక పఠనం ఎంతో అవసరమని వారు తెలియజేశారు. గ్రంథాలయ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పని చేస్తున్నటువంటి మేకపాటి శాంతి కుమారికి గ్రంథాలయ అభివృద్ధిలో మా వంతు సహకారం అందిస్తామని వారు తెలియజేశారు. అదే విధంగా **మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ** ఈ గ్రంథాలయానికి స్థలాన్ని ఇచ్చినటువంటి రేబాల పట్టాభిరామి రెడ్డిని మనం స్మరించుకోవాలని, ఈ గ్రంథాలయానికి ఎంతో చరిత్ర ఉందని, గ్రంథాలయంలో చదువుకొని ఐఏఎస్, ఐపిఎస్‌లు అయినవారు ఉన్నారని, గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతో అవసరమని అలాంటి గ్రంథాలయాల అభివృద్ధికి ప్రస్తుత చైర్మన్ కష్టపడి పని చేస్తున్నారని అదే విధంగా సిబ్బంది కూడా అంకిత భావంతో పని చేసి నెల్లూరు జిల్లా గ్రంథాలయాన్ని నెంబర్ 1 స్థాయి ఉంచాలని తెలియజేశారు. రాజకీయ నాయకులను తెలిసిన వాళ్ళను ఎవరు కలిసినా మీ చైర్ పర్సన్ గ్రంథాలయ అభివృద్ధి కి సహాయం చేయండి అని అడుగుతున్నారు అని ఒక కమిట్మెంట్ తో కష్టపడి పని చేస్తున్నారు అని తెలిపారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు, డిడి మస్తాన్ రెడ్డి,ప్రముఖ కవి పెరు గు రామకృష్ణ మాట్లాడుతూ అందరికీ 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పుస్తక పఠనం వలన మేధో శక్తి పెరుగుతుందని, విజ్ఞానవంతులైన ప్రతి ఒక్కరూ పుస్తకాన్ని చదువుతారని కావున విద్యార్థులు నేటి యువత పుస్తకాల చదవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. అదేవి ధంగా ఉమ్మడి నెల్లూరు **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి మాట్లాడుతూ** చదువుల తల్లి సరస్వతి దేవి నిలయాలైన గ్రంథాలయాలను అభివృద్ధి చేయడం కోసం అందరి సహకారంతో పనిచే స్తున్నానని, సంస్థను అర్థం చేసుకోవడానికి సమయం పట్టిందని ఉమ్మడి నెల్లూ రు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాలను సందర్శించడం జరిగిందని, జి ల్లాలో ఉన్నటువంటి అన్ని గ్రంథాలయాల అభివృద్ధికి అందరు సహకారం కోరు తున్నానని, గ్రంథాలయాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జిల్లా మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు ఇతర ప్రజాప్రతితులు అందరూ సహకారం తీసుకొని ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గ్రంథాలలోని అభివృద్ధి చేస్తానని తెలిపారు. చదువుల తల్లి సరస్వతి దేవి నిలయాలైన గ్రంథాలయాలను, ఒక పెద్ద వ్యవస్థ అయినటువంటి ఈ గ్రంథాలయ వ్యవస్థను గత ప్రభుత్వం నిర్వీరం చేసిందని ఈనాడు మా నాయ కుడు లోకేష్ బాబు గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలియ జేశారు. గ్రంథాలయాల పట్ల అత్యంత ప్రేమ పెరిగిందని గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ అంటే హోదా కాదు ఇది ఒక బాధ్యత అని తెలిపారు. ఇదే బాధ్య తతో తప్పనిసరిగా జిల్లాలో గ్రంథాలయాలకు మార్పు తీసుకొస్తానని, ఆరోజు మాటిచ్చాను గ్రంథాల యాలను దేవాలయాలకు మారుస్తానని తప్పనిసరిగా ఆ విధంగా ప్రయత్నం చేస్తున్నానని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సెక్రె టరీ కుమార్ రాజా, లైబ్రేరియన్ సునీత, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, యువత, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షాత్తు జిల్లా కలెక్టర్ లాగిన్నే దుర్వినియోగం చేసిన వారికి లైజనింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలా?

- చర్యలు తీసుకోవాల్సిన వారిపై అదనపు బాధ్యతలు ఎలా?



నెల్లూరు, నవంబర్ 14, ప్రభాతవార్త - కలెక్టరేట్ గతంలో కలెక్టర్ లాగిన్ దుర్వినియోగం ఆరోపణలు ఎదుర్కొన్న ఓ డిప్యూటీ తాసిల్దార్ (ప్రస్తుతం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సి సెక్షన్‌లో కీలకమైన సీటులో విధులు నిర్వహి స్తుం దగా ఆమెపై అనేక ఆరోపణలు వచ్చినా గాని చర్యలు తీసుకోవాల్సింది పోయి ఆ ఫైల్ పెండింగ్లో ఉండగానే విజయవాడ లైజనింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు ఇస్తూ జిల్లా కలెక్టర్ శుక్ల ఆమోదం పలికినట్టు తెలుస్తుంది. గతంలో 2025 అప్పటి జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఈ ఉద్యోగిని పై చార్జెస్ ఫ్రేమ్ చేయమని సాక్షాత్తు ఉత్తర్వులు జారీ చేయగా ఆ ఫైల్‌ను అటక ఎక్కించి ఇప్పుడు తాజాగా లైసెనింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు ఇచ్చి విజయవాడకి పంపించడానికి సన్నా హాలు జరుగుతున్నాయి. కలెక్టర్ లాగిన్ దుర్వినియోగం చేసినందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాల్సింది. పోయి ఆమెకు అదనపు బాధ్యతలు ఇచ్చి లైజింగ్ ఆఫీసర్‌గా పంపించడం గమనార్ధకం కలెక్టర్ ఆ పాత ఫైల్‌ని తెప్పించి ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. అందువల్ల తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆరోపి స్తున్నారు.
జిల్లా కలెక్టర్ వివరణ సి సెక్షన్ డిప్యూటీ తాసిల్దార్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు చర్చిస్తున్నామని అమె పై ఎమి ఆరోపణలు లేకపోతే తుది నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వివరించారు.

2027 జనాభా గణన దశ 2 ఫీల్డ్ లెవల్ ట్రైనర్లుకు శిక్షణ పూర్తి



నెల్లూరు, నవంబర్ 14, ప్రభాతవార్త 2027 జనాభా గణన దశ 2 (జనాభా లెక్కింపు)లోభాగంగా, మొదటిబ్యాచ్‌కు (నెల్లూరు,గూడూరు డివిజన్ల ఫీల్డ్ లెవల్ ట్రైనర్లు ఎఫ్‌టీలు) శిక్షణ కార్యక్రమం 11.11.2026 నుండి 14.11.2026 వరకు నిర్వహించబడింది. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. విజయ కుమార్ పాల్గొన్నారు. జిల్లా జనాభా గణన ఇన్‌ఛార్జ్ రాజా మోహన్‌రెడ్డి, అదనపు జనాభా గణన ఇన్‌ఛార్జ్ కుమారి అద్విక ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్లుగా శ్యామ్ కుమార్, జి. వెంకట వ్యవహరించారు. ఈ కార్యక్రమం కలెక్టరేట్‌లోని సమన్వయ విభాగం పర్యవేక్షణలో నిర్వహించారు.

బాలల హక్కులే.. ఉజ్వల భవిష్యత్తుకు పునాది!


: గ్రంథాలయ జిల్లా చైర్ పర్సన్ శాంతకుమారి



కొడవలూరు, నవంబరు 14 ప్రభాతవార్త : బాలల హక్కులు, రక్షణ, విద్య, సమగ్ర అభివృద్ధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ మేకపాటిశాంతకుమారి సూచించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నార్త్ రాజుపాలెంలో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులతో 'నా రోజు.. నాహక్కులు.. నాభవిష్యత్తు' అనే ఇతివృత్తంతో అవగాహనర్యాలీ చేపట్టారు. అనంతరం తపాతోపు ప్రాంతంలోని ఆశ్రమ బాలలతో కలిసి సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు బాలలతో ముచ్చటిస్తూ విద్య ప్రాముఖ్యత, బాలల హక్కులు, భద్రత, రక్షణ అంశాలను వివరించారు. ప్రతి బాలబాలికకు సమాన అవకాశాలు కల్పించాలని, వారి హక్కులనుగౌరవించాలని సూచించారు. బాలలు ఆత్మవిశ్వాసం తో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యలో రాణించాలనితెలిపారు. బాలల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభుత్వ శాఖలు, తల్లిదండ్రులు, సమాజం సమష్టిగా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో 250 మంది పాఠశాల విద్యార్థులు, 78 మంది ఆశ్రమ బాలలు ఉత్సాహంగా పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలతో అలరిం చారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్, ఐటీడీఏ ప్రతినిధి శాంతకుమారి, పోలీసు సిబ్బంది వరప్రసాద్, మండల ఏపీఎం, క్యాస్ ప్రతినిధి ఐ.శ్రీనివాసరావు, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, సంరక్షణ అధికారులు సుమలత, సమత, మంజుల, ఆశ్రమ నిర్వాహకులు శ్రీలక్ష్మి, పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న కారు

: త్రుటిలో తప్పిన పెను ప్రమాదం!



అనంతసాగరం, నవంబర్ 14, ప్రభాతవార్త అనంతసాగరం మండలం చాపురాళ్లపల్లి సమీపంలోని హై వే పై శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు కారులో ప్రయాణిస్తున్న తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి రాజీవ్ గాంధీ ప్రయాణిస్తున్న కారు స్కూల్ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో స్కూల్ నుంచి ఇళ్లకు వెళ్తున్న చిన్నారులు ఉండటంతో తీవ్ర ఆందోళన నెలకొంది. అయితే అదృష్టవశాత్తూ పిల్లలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ఐఏఎస్ అధికారి రాజీవ్ గాంధీ స్వల్ప గాయాలతో బయటపడగా, ఆయనను చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలో ఆసుపత్రికి తరలింపు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం, నవంబరు14, ప్రభాతవార్త: మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాలనుంచి శనివారం సాయంత్రానికి0 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 19.764టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 0, ఎన్ఎఫ్‌సికి 0, పెన్నా డెల్టా 0 క్యూసెక్కు ల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 88.230మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

పంచాయితీ రిటర్నింగ్ అధికారుల బదలాయింపు పై మేకపాటి ధ్వజం..

- చేజర్లలో సర్పంచ్ ఎన్నికల వేళ ఆర్‌ఓల మార్పుపై అనుమానాలు
- 26 పంచాయతీల్లో 13 చోట్ల గ్రామపంచాయతీలలో రిటర్నింగ్ అధికారుల మార్పు..



చేజర్ల, నవంబర్14, ప్రభాతవార్త ఆత్మకూరు నియోజవర్గంలోని చేజర్ల మండలంలో త్వరలో జరగనున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ రిటర్నింగ్ అధికారుల మార్పుపై ఆత్మకూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఒక ప్రకటనలోశనివారం తీవ్రంగా స్పందించారు. ఇటీవల మండలంలో జరిగిన పరి షత్ ఎన్నికలలో అధికారుల లోప భూష్ట విధానాల తో తమ పార్టీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని ప్రస్తుత అధికార పక్షం ఇదే తరహాలో వ్యవహరిస్తూ వారికి అనుకూలంగా ఉన్న అధికారులను నిర్మించుకోవడం శోచనీయమన్నారు. నామినేషన్ల ఘట్టంలో ఆర్వోలు ఏకపక్షంగా వ్యవహరిస్తే న్యాయపోరా టకైనా సిద్ధమవుతామని హెచ్చరించారు.రాబోయే సర్పంచ్ ఎన్నికల్లోనూ అక్రమాలకు అవకాశం కల్పించేలా తెరవెనుక పావులు కదుపుతున్నారా? అన్న అనుమానాలు మండల ప్రజల్లో వ్యక్తమవుతున్నాయన్నారు. చేజర్ల మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీలు ఉండగా, రెండో విడతలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీన జిల్లా ఎన్నికల అధికారులు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను రిటర్నింగ్ అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు కానీ, మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు **మిగతా 2 పేజీలో**

చేజర్లలో వైకాపా నాయకులపై పోలీసుల బెదిరింపులా..?

- సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తే కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నారంటూ ఆరోపణలు..
- చేజర్ల ఎస్సై వ్యవహారశైలిపై మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం
- పంచాయతీ ఎన్నికల విధుల నుంచి ఎస్సైని తప్పించాలంటూ జిల్లా అధికారులకు విజ్ఞప్తి



చేజర్ల, నవంబర్14, ప్రభాతవార్త చేజర్ల మండలంలో రెండో విడతలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉండి, ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించే అవకాశాలున్న గ్రామాల్లో పోటీకి సిద్ధమవుతున్న వైకాపా నాయకులు, కార్యకర్తలను పోలీసులు బెదిరిస్తున్నారంటూ ఆ పార్టీ నాయకత్వం తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఎన్నికల్లో పోటీకి నిలిస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని చేజర్ల ఎస్సై హెచ్చరిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతు న్నాయని ఆత్మకూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదలచేశారు.చేజర్ల మండలంలోని ఎన్.వి.కండ్రిక, మైపాడువారికండ్రిక, నెర్నూరు తదితర గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ ఎస్సై పర్యటిస్తూ వైకాపా నాయకులను పోటీకి దూరంగా ఉండేలా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోప ణలు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. **మిగతా 2 పేజీలో**

చేజర్లలో వైకాపా నాయకులపై పోలీసుల బెదిరింపులా..?

మొదటిపేజీ తరువాయి

ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఇదే తరహా ఆరోపణలు..!! గతంలో చేజర్ల మండలంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల సమయంలోనూ ఇదే విధంగా పోలీసుల వ్యవహారశైలిపై ఫిర్యాదులు వచ్చాయని మేకపాటి విక్రమ్‌రెడ్డి గుర్తుచేశారు. పలు గ్రామాల్లో వైకాపా పోలింగ్ ఏజెంట్లను బెదిరించి పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపించారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా కోటితీర్థం, తూర్పు కంభంపాడు, నాగులవెల్లటూరు, కాకివాయి, పుట్టుపల్లి, పాడేరు, తిరుపతి నాయుడుపల్లి తదితర గ్రామాల్లో వైకాపా ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల్లో ఉండనివ్వకుండా భయపెట్టినట్లు పార్టీ శ్రేణులు ఆరోపిస్తున్నాయని పేర్కొన్నారు.

మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతుందనే ఆందోళన..!!

ప్రస్తుతం రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోనూ గతంలో ఎదురైన పరిస్థితులే మళ్లీ పునరావృతమవుతున్నాయని వైకాపా నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష నాయకులను పోటీకి దూరం చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎవరు పోటీ చేయాలి..? ఎవరు చేయకూడదు..? అన్నది నిర్ణయించే అధికారం ప్రజలకు, అభ్యర్థులకు మాత్రమే ఉంటుందని, పోలీసుల బెదిరింపులతో ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడం తగదన్నారు.

ఎన్నికల విధుల నుంచి ఎస్సైని తప్పించాలి: చేజర్ల ఎస్సై వ్యవహారశైలిపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని మేకపాటి విక్రమ్ రెడ్డి డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికల విధుల్లో చేజర్ల ఎస్సై కొనసాగితే మండలంలోని పలు గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైకాపా నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ చేపట్టి, విచారణ పూర్తయ్యే వరకు చేజర్ల ఎస్సైని పంచాయతీ ఎన్నికల విధుల నుంచి తప్పించాలని జిల్లా అధికారులను కోరారు. ఆయన స్థానంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించే సమర్థవంతమైన అధికారికి ఎన్నికల బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ఉందని, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికల యంత్రాంగం చర్యలు తీసుకోవాలని మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

కలువాయి నవంబర్ 14 ప్రభాతవార్త : మన దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రు జన్మదినం పురస్కరించుకొని శనివారం మండలంలో వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా తెలుగు రాయ పురం ఎస్‌సి పాఠశాల నందు పాఠశాల ప్రధానో ధ్యాయులు జి.వి మురళీ కృష్ణా ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు నెహ్రు పిల్లలంటే ఇష్టమని తన జయంతి



రోజున బాలల దినోత్సవ వేడుకగా నిర్వహించడం ఇందుకు నిదర్శనమని అన్నారు. పిల్లల సంరక్షణ, ప్రేమ, విద్యను అందిస్తు భవిష్యత్తులో గొప్ప పౌరులుగా ఎదుగుతారని ఆయన తెలిపారు. పిల్లలకు మిఠాయిలు పంచి పెట్టారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్‌వి కృష్ణారెడ్డి, డి వినోద్, సిఆర్ ఎంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని నూకన పల్లి బిసి కాలనీ నందు ఉండే పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ ,పలకలు తదితర విద్యాసామాగ్రి అందజేశారు. మండల వాసవీ క్లబ్ అధ్యక్షురాలు పువ్వాడి రాధమ్మ, వాసవీ క్లబ్ సభ్యులు ఆత్మకూరు హరిష్, ఇంటర్ నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ పువ్వాడి వెంకట కృష్ణయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నూరెళ్ళ లక్ష్మీ కుమారి, ఆర్యవైశ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సీతారామపురం నవంబర్ 14 ప్రభాతవార్త : సీతారామపురం మండలంలోని ఓగూరు వాండ్ల పల్లి గ్రామానికి చెందిన కాకు నాగేష్ అనే వ్యక్తి శనివారం పురుగులు మందు త్రాగి ఆత్మహత్యాయత్నానికి పాలుపడిన ఘటన చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే నాగేష్ పురుగుల మందు త్రాగిన విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కి సమాచారం అందించేందుకు ప్రయత్ని ంచారు. అయితే 108 అంబులెన్స్ అందుబాటులోకి రాకపోవడంతో జాతీయ రహదారి అంబులెన్స్‌కి సమాచారం అందించారు. దీంతో స్పందించిన



జాతీయ రహదారి అంబులెన్స్ సిబ్బంది నాగేష్‌ను సమీప ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అయితే అక్కడ సిబ్బందిలో ఒక్కరు మాత్రమే ఉండి ఇతర సిబ్బంది అందుబాటులోకి లేకపోవడంతోపాటు ఆక్సిజన్ సౌకర్యం కూడా లేకపోవడంతో పరిస్దితి దృష్ట్యా 108 అంబులెన్స్‌లో ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. నాగేష్ ఆత్మహత్యాయత్నానికి పాలుపడడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రిపోర్టర్‌ని పరామర్శించిన హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి

బుచ్చి నవంబర్ 14 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ పరిధిలో ఆటో బోల్తా పడ్డ సంఘటనలో తీవ్రంగా గాయాలు అయిన యాక్టె రిపోర్టర్ బాస్కర్‌ని హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి పరామర్శి ంచారు. వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రమాదం జరిగిన విధి విధానం గురించి ఆయన పూర్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆయన సూచించారు.



హాస్పటల్‌కి టూత్ పేస్టు బహుకరణ

బుచ్చి నవంబర్ 14 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ వైద్యశాలకు హాస్పటల్ డైరక్టర్ దొడ్ల కోదండ రామిరెడ్డి తమ సొంత నిధులతో టూట్ పేస్టులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ పేస్టులు మెడికేటెడ్ అని ఆయన వివరించారు. ఈపే స్టులు హాస్పటల్‌కి వచ్చే పేషింట్లకు ఇవ్వాలని డాక్టర్లకు సూచించినట్లు ఆయన చెప్పారు.



బిజెపి కోవూరు నియోజకవర్గం గ్రామ పంచాయితీ ఎన్నికల సమాయత్త సమావేశం


బుచ్చి నవంబర్ 14 ప్రభాతవార్త : బుచ్చిరెడ్డిపాళెం అర్బన్‌లోని అంబేద్కర్ భవనంలో ఉదయం 11 గంటలకు బిజెపి జిల్లా అధ్యక్షులు ఎస్ వంశీధర్‌రెడ్డి అధ్యక్షత కోవూరు నియోజకవర్గం గ్రామ పంచా యితీ



ఎన్నికల సమాయత్త సమావేశం జరిగింది. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యాక్షులు పి సురేంద్రరెడ్డిపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జరగోయే గ్రామ పంచాయతీ ఎన్నికలలో బిజెపి పార్టీనా యకులు కార్యకర్తలు అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చించారు. ఈకార్యక్రమంలో ఓబిసి మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం విజయ్‌కుమార్, రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యదర్శి చేవూరు వినయ్‌నారాయణ, ఎస్‌సి మోర్చ జిల్లా అధ్యక్షులు ఎస్‌పి పరుశరాం, కోవూరు నియోజకర్గం బిఎల్‌ఎ కాసా శ్రీనివాసులు, బిజెపి సీనియర్ నాయకులు డాక్టర్ జి.వి కృష్ణారెడ్డి, డాక్టర్ రాఘివరెడ్డి, ఇండ్ల వెంకట రాఘవేంద్ర, మారుబోయిన శ్రీనివాసులు, గండి రఘురామయ్య, రూరల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, పోలిశెట్టి వెంకట సుబ్బారావు, కైలాసం శ్రీనివాసులురెడ్డి, మెర్కొండ శివకుమార్ ,కొమ్మిరెడ్డి కోటారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఐఏఎస్ అధికారి కుటుంబానికి మంత్రి ఆనం పరామర్శ...

నెల్లూరు, నవంబర్ 14, ప్రభాతవార్త - వైద్యం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య చికిత్సను దగ్గరుండి పర్యవేక్షించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలో ఆసుపత్రికి తరలింపు నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం చాపురాళ్లపల్లి వద్ద జాతీయ రహదారి నం565 పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ కేడర్‌కు చెందిన 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు కుటుంబ సభ్యులు గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం



రామనారాయణ రెడ్డి తక్షణమే స్పందించి, ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని, గాయపడిన వారికి అందిస్తున్న అత్యవసర వైద్య చికిత్సను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించారు. వైద్యులతో మాట్లాడి బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి ఆనం, అవసరమైన అన్ని వైద్య సేవలను తక్షణమే అందించాలని సూచించారు. అనంతరం మరింత మెరుగైన వైద్య చికిత్స కోసం క్షతగాత్రులను నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి తరలించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పంచాయితీ రిటర్నింగ్ అధికారుల బదలాయింపు పై మేకపాటి ధ్వజం..

మొదటిపేజీ తరువాయి సంబంధించి రిటర్నింగ్ అధికారులను ఈ నెల 12 వ తేదిన మార్చడం ఇప్పుడు పలు ప్రశ్నలకు తావిస్తుందని పేర్కొన్నారు. మొదట హెడ్మాస్టర్లను రిటర్నింగ్ అధికారులుగా నియమించినప్పటికీ, 13 పంచాయతీలకు వారిని తప్పించి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులను కొత్తగా నియమిస్తూ నూతన ఉత్తర్వులను జారీ చేశారు. ఆ 13 పంచాయతీలకు నియమించిన హెడ్మాస్టర్ల అంగీకారం లేకపోతే ఇతర పాఠశాలల హెడ్మాస్టర్లను నియమించాల్సి ఉంది. అలా కాకుండా వివిధ శాఖల అధికారులను నియమిస్తూ తీసుకున్న ఈ ఆకస్మిక మార్పుల వెనుక కారణాలేమిటి..? ఎలాంటి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు..? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. రిటర్నింగ్ అధికారుల మార్పు వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక మరేదైనా కారణముందా..? కొత్తగా నియమితులైన కొందరు అధికారులు అధికార పార్టీ నాయకుల ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం పారదర్శకతతో వ్యవహరించి ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు ఇంకా రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలకు ముందు ఆర్‌ఓల మార్పు వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుందని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర పోషించే రిటర్నింగ్ అధికారుల నియామకాలు నిష్పక్షపాతంగా ఉండాలని, ఎలాంటి రాజకీయ ప్రభావాలకు తావు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. గ్రామస్థాయి ప్రజాస్వామ్యానికి పునాదులైన పంచాయతీ ఎన్నికలు ఎలాంటి అక్రమాలు, ప్రలోభాలు, రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాల్సిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా రిటర్నింగ్ అధికారుల నియామకాలు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్ ప్రక్రియలన్నింటినీ ఎన్నికల సంఘం నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. మండలంలోని 13 పంచాయతీల్లో ఆర్‌ఓల మార్పునకు గల కారణాలను జిల్లా ఎన్నికల అధికారులు బహిర్గతం చేయాలని, ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలి.

13 పంచాయతీల్లోనే ఎందుకు మార్పులు జరిగాయి..? ఈ ప్రశ్నలకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ఇచ్చే సమాధానంపైనే చేజర్ల పంచాయతీ ఎన్నికల పారదర్శకతపై ప్రజల్లో నెలకొన్న సందేహాలు తొలగే అవకాశం ఉంది. ఆదురుపల్లి పిఓగా ఎంశ్రీ వాసు ఏఈఈ పిఆర్ ఎంపీడీవో ఆఫీస్ మర్రిపాడు మండలంలో ప్రస్తుతం పని చేస్తున్నారు. ఆయనకు అధికార పార్టీ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఆ నేతలు ఏం చెబితే అది ఆయన చేసే అవకాశం ఉంది. అలాగే తూర్పుపల్లి పిఓగా ఎన్ మల్లికార్జున ను ఆర్ఎస్‌డిటి గా మర్రిపాడు మండలం నుండి నియమించడం జరిగింది. ప్రస్తుతం ఆయన చేజర్ల మండలంలో ఇన్చార్జిగా ఆర్ఎస్‌డిటి గా పనిచేస్తున్నారు.

ఎంపీటీసీ నామినేషన్ ప్రక్రియలో స్క్రూటినీ సమయంలో నామినేషన్లను తీసివేయడంలో ఆర్‌ఓ బొద్దు ప్రసాద్ కు పూర్తి సహాయ, సహకారం మల్లికార్జున అందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నేతలు ఎలా చెబితే అలా చేయడమే ఆయనకు అలవాటని విమర్శలు ఉన్నాయి. నాగుల వెల్లటూరు గ్రామానికి పిఓగా ఎస్ వెంకటేశ్వర్లు ఆర్ఎస్ డిటి కలువాయి మండలం నుండి వేయడం జరిగిందన్నారు. వీటిని పరిశీలించి, అవినీతి అక్రమాల ఆరోపణలు ఉన్న అధికారులను తొలగించి పాఠశాల హెడ్మాస్టర్లను రిటర్నింగ్ అధికారులుగా నియమించాలని ఆయన కోరారు.

మొదటి రోజు మూడు నామినేషన్లు

గూడూరు, నవంబర్ 14, ప్రభాతవార్త : గూడూరు పురపాలక ఎన్నికలకి మొదటి రోజు 3 నామినేషన్లు దాఖలు చేశారు. 9, 12, 27 వార్డులకు నామినేషన్లు దాఖలు చేశారు. 9, 27 వార్డులు వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 12 వార్డులో టీడీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారనీ ఎలక్షన్ అధికారులు తెలిపారు. పోలీస్‌లు నామినేషన్ కేంద్రం వద్ద డీఎస్పీ నరసింహ మూర్తి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.



ఘనంగా 3 యఫ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం

ముత్తుకూరు, నవంబర్ 14, ప్రభాతవార్త : 3 యఫ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వారు తమ సామాజిక బాధ్యత కార్యక్రమాల భాగంగా బాలల దినోత్సవం సందర్భంగా సమాజంలోని పాఠశాల పిల్లలలో సృజనాత్మకత, ప్రతిభ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ బహుమతులు, స్వీట్లు,



అల్పాహార పదార్థాలను అందజేసి బాలల దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమం కింద క్రింది పాఠశాలలు, కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఆంగన్‌వాడీ సెంటర్ (ఎస్‌సి కాలనీ) 15 మంది పిల్లలు ఆంగన్‌వాడీ సెంటర్ 2 (పంట పాలెం), 11 మంది పిల్లలు ఆంగన్‌వాడీ సెంటర్ (కొల్లమిట్ట), 10 మంది పిల్లలు ఎలిమెంటరీ స్కూల్ (ముత్తకూరు): 25 మంది పిల్లలు, పొట్టెంపాడు ఎలిమెంటరీ స్కూల్ - 45 మంది పిల్లలు పొట్టెంపాడు అంగన్వాడీ సెంటర్ 10 మంది పిల్లలు మొత్తం పిల్లలు ఉత్సాహంగా పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో విజేతలకు బహుమతులు, స్వీట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాలలో డి.జి.ఎం (హెచ్.ఆర్) పి. శేఖర్ రెడ్డి, డెప్యూటీ మేనేజర్ ఎ. సునిల్ బాబు పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల భవిష్యత్తు నిర్మాణంలో విద్య కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సంస్థ తరపున ఇలాంటి సామాజిక కార్యక్రమాల ద్వారా గ్రామీణ విద్యా అభివృద్ధికి ఎల్లప్పుడూ సహకరించడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలకు సంస్థ ధన్యవాదాలు తెలియజేసారు.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

వింజమూరు, నవంబర్14, ప్రభాతవార్త : వింజమూరు శాఖ గ్రంథాలయంలో శనివారం 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాధికారి జ్యోతి కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలుర ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు జి.వీరరాఘవులు హాజరయ్యారు. ముందుగా ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ



చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌లాల్ నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయనను చాచా నెహ్రూ అని పిలుస్తారని అన్నారు. ఆయనకు గులాబీ అంటే ఎంతో ఇష్టమని, పిల్లలు కూడా గులాబీలలాగా పరిమళిస్తూ సమాజంలో మంచిపౌరులుగా నిలవాలన్నదే ఆయన కోరిక అని తెలిపారు. ఈనాటి బాలురే రేపటి భారత దేశ నిర్మాతలని, పిల్లల పట్ల ఆయన ఎంతో ఆలోచన కలిగి ఉండేవారని అన్నారు. పిల్లలు విద్యార్థి దశ నుంచే దేశభక్తి, సమాజ సేవ తదితర గుణాలను కలిగి ఉండాలని, అప్పుడే సమాజంలో ఉత్తమ పౌరులుగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీ.డి.అంజయ్య, పిఈటి సుమలత, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్ఫాంట్ జీసస్‌లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

- ఉత్సాహంగా మా బడి వంట కార్యక్రమం

వింజమూరు, నవంబర్14, ప్రభాతవార్త : వింజమూరు పట్టణంలోని ఇన్ఫాంట్ జీసస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఉత్సాహభరితవాతావరణంలో ముగిశాయి. పాఠశాల కరస్పాండెంట్ ఎస్.ఐజాక్ ఆధ్వర్యంలో నవంబర్ 14 చిన్నారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గత మూడు రోజులుగా విద్యార్థులకు పాఠశాలలో వివిధ రకాల ఆటల



పోటీలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఎంతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ముగింపు వేడుకల్లో ఆకట్టుకున్న మా బడి వంట వేడుకల్లో భాగంగా శనివారం ప్రత్యేకంగా మా బడి వంట కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, తమ స్వహస్తాలతో వివిధ రకాల రుచికరమైన వంటకాలను తయారు చేసి అందరిని ఆశ్చర్యపరిచారు. చిన్నారి చేతులు వండిన ఆ వంటకాల రుచి అద్భుతంగా ఉందంటూ ఉపాధ్యాయులు, ఆహ్వానితులు విద్యార్థులను అభినందించారు. జీవిత పాఠాలతో కూడిన ప్రత్యేక అవగాహన కల్పించారు. కేవలం విద్యకే పరిమితం కాకుండా, విద్యార్థులకు నిత్య జీవితంలో ఉపయోగపడే నైపుణ్యాలను నేర్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని కరస్పాండెంట్ ఎస్.ఐజాక్ తెలిపారు. ఇంటి పనుల్లో ముఖ్యంగా వంట గదిలో తల్లిదండ్రులకు పిల్లలు ఏ విధంగా సహాయపడవచ్చో ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించారు. పిల్లల్లో చిన్నతనం నుంచే స్వయంగా పనులు చేసుకునే అలవాటు, బాధ్యతాభావం, తోటివారితో సహకార భావం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే తమ పాఠశాల ప్రధాన లక్ష్యమని యాజమాన్యం పేర్కొంది. కేవలం చదువు మాత్రమే కాకుండా, జీవితానికి అవసరమైన మానవతా విలువలను, ఆచరణాత్మక నైపుణ్యాలను నేర్పించడమే తమ ఉద్దేశమని వారు స్పష్టం చేశారు. ఈ బాలల దినోత్సవ వేడుకలను మా బడి వంట కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థులకు, అంకితభావంతో వ్యవహరించిన ఉపాధ్యాయ బృందానికి, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చదివితేనే జ్ఞానం.. గ్రంథాలయంతోనే విజ్ఞానం!

: లైబ్రేరియన్ సురేందర్ రెడ్డి

కొడవలూరు, నవంబరు 14 ప్రభాతవార్త: మండలంలోని యల్లయపాలెం శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను లైబ్రేరియన్ జె. సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. గ్రామపెద్ద, గ్రంథాలయ భవన దాతల వారసుడు ఇసనాక సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ పాఠకులు ఏకొల్లు ప్రభాకర్‌రెడ్డి, చిల్లకూరు యు గంధర్‌రెడ్డి, మందిపాటి వినయ్‌కుమార్‌రెడ్డి, తమ్మిరెడ్డి ప్రసాదరెడ్డి, విందురు సోమశేఖర్‌రెడ్డి విజ్ఞాన సము పార్జనలో గ్రంథాలయాల ప్రాధాన్యాన్ని బాలబాలికలకు వివరించారు. పుస్తక పఠనం ద్వారావిజ్ఞానాన్ని పెం పొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయ పాఠకులు, గ్రామస్థులు, బాలబాలికలు పాల్గొన్నారు.



బాలల హక్కులు.. భవిష్యత్తుపై అవగాహన

విడవలూరు, నవంబరు 14 ప్రభాతవార్త: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ నిరూప ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పి ంచారు.



ముఖ్య అతిథులుగా పాల్గొన్న జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు వాణి, అక్షర హైస్కూల్‌కు చెందిన శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయుడు భాస్కరమూర్తి బాలల హక్కులు, సంరక్షణ, విద్య ప్రాముఖ్యత, భవిష్యత్తుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాలను విద్యార్థులు, గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ నిరూప కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవండి.. విజ్ఞానవంతులు కండి!

: లైబ్రేరియన్ కె.రాజేశ్వరి


కొడవలూరు, నవంబరు 14 ప్రభాతవార్త: కొడవలూరు శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ కె. రాజేశ్వరి ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో గ్రంథాలయ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య జెండా వందనం చేసి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షి ంచారు. అనంతరం విద్యార్థులతో గ్రంథాలయ ప్రతిజ్ఞ చేయించారు. బాలల దినోత్సవం సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పిల్లలంటే నెహ్రూకు ఎంతో ఇష్టమని, ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటారని వివరించారు. ఈ నెల 20వ తేదీ వరకు గ్రంథాలయంలో నిర్వహించే వివిధ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని బహుమతులు సాధించాలని లైబ్రేరియన్ కె. రాజేశ్వరి కోరారు. అనంతరం గురుకుల, ఉన్నత పాఠశాల విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యా యురాలు షకీలా, ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ నారాయణ, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్

నెల్లూరు అగ్రికల్చర్, నవంబర్14, ప్రభాతవార్త : హైదరాబాద్ హైటెక్ సిటీలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సమ్మిట్ లో 76 మంది విదేశాల ప్రతినిధులతో పాటు రాహుల్ గాంధీ, సీయం రేవంత్‌రెడ్డి పాల్గొన్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం కల్పిం చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గుడ్‌షపర్డ్ పాఠశాలలో విద్యార్థులకు వాసన్ ఐకేర్ కంటి పరిక్షలు

రాపూరు, నవంబరు 14, ప్రభాతవార్త : మండల కేంద్రమైన రాపూరులోని గుడ్‌షపర్డ్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శనివారం వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వారిచే విద్యార్థులకు కంటి పరిక్షలను నిర్వహించారు. ఇందులో బాగంగా పలువురు కంటీ వ్యాధి నిపుణులు విద్యార్థులకు కంటి పరిక్షలన నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి



అద్దాలు అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కంటి వైద్య శిభిరంలో వాసన్ ఐ కేర్ ఆప్తమెట్రిస్ట్ నికిత, ఏఆర్ టెక్నీషియన్ పవన్, ఈశ్వర్, సీనియర్ మేనేజర్ మార్కెటింగ్ మేనేజర్ కృష్ణ నరేష్, పాఠశాల కరస్పాండెంట్ రాజరత్నం, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు వున్నారు. ఘనంగా బాలల దినోత్సం గుడ్‌షపర్డ్ ఇంగ్లీషు మీడియ పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రు చిత్రపఠానికి పూలమాల వేసి నివాళుర్పించారు.

వైసీపీలో చేరిన అడవి లక్ష్మీపురం టిడిపి నాయకులు

కావలి, నవంబర్14, ప్రభాతవార్త : కావలి రూరల్ మండలం అడవిలక్ష్మీపురంకు చెందిన టిడిపి మాజీ సర్పంచ్ చల్లా తిరుపాలు, టిడిపి ఆరో వార్డు మెంబర్ పసుపర్తి మాల కొండయ్య లు శనివారం టిడిపిని వీడి కావలి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, నియో



జకవర్గ వైఎస్ఆర్సిపి ఇంచార్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి మీద నమ్మకంతో ఆయన సమక్షంలో వైసీపీలో చేరడం జరిగింది. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి మద్దతుతో అడవి లక్ష్మీపురం సర్పంచ్‌గా చల్లా తిరుపాలు పోటీ చేస్తున్నారని అడవి లక్ష్మీపురం ఓటర్లు చల్లా తిరుపాలును గెలిపించాలని కోరడం జరిగింది. వైసిపి రాష్ట్ర నాయకులు దామిశెట్టి సుధీర్ నాయుడు, మాజీ ఏఎంసీచైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వోదయ వ్యవస్థాపక దినోత్సవం

కావలి, నవంబర్14, ప్రభాతవార్త : విశ్వోదయ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జవహర్ భారతి కళాశాల ఎం.ఎం.హాల్లో శనివారం బాలల దినోత్సవం సందర్భంగా విశ్వోదయ బాలుర్నోన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి.వి. మధుసూదనరావుని ఘనంగా సత్కరించి, విశ్వోదయ గౌరవ జీవిత సభ్యత్వం ప్రదానం చేయడం జరిగింది.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు విశ్వోదయ బాలు రోన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులుగా పాఠం చెప్పి, కొన్ని వేలమంది విద్యార్థుల కళ్ళల్లో ఆనందాన్ని చూసి ఎంతో బోధనా సంతృప్తిని పొందానని తెలియజేశారు. విశ్వోదయ గౌరవ జీవిత సభ్యత్వాన్ని స్వీకరించి నందుకు నా జన్మ ధన్యమైనదని పేర్కొన్నారు. అధ్యక్షత వహించిన విశ్వదయ రెక్టర్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గొప్ప ఉపాధ్యాయుడైన మధుసూ దనరావుని సన్మానించి, గౌరవించుకోవడం చాలా గర్వంగా ఉందని హర్షాన్ని వ్యక్తం చేశారు. విశ్వోదయ పూర్వవిద్యార్థి ఎస్.జె. ప్రతాపరెడ్డి మాస్టారికి సన్మాన పత్రం సమర్పించారు. జ్యోతిశ్రీ, విద్యార్థిని విద్యార్థులకు ఎన్నో రకాల పోటీలను నిర్వహించారు. అపోలో హాస్పిటల్ వైద్యులు, విశ్వోదయ పూర్వ విద్యార్థి అయిన డాక్టర్ వైదేహి ఆటపాటలలో, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన కావలి పట్టణ, మండల స్థాయి పాఠశాల విద్యార్థిని విద్యార్థులందరికీ బహుమతి ప్రదానం చేశారు. విశ్వోదయ బాధ్యులు, ఉపాధ్యాయులు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు.

ఉదయగిరిలో నామినేషన్ సామాగ్రి సిద్ధం

ఉదయగిరి, నవంబర్14, ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియకు సంబంధించి ఉదయ గిరిలో అధికారులు ఏర్పాటు ముమ్మరం చేశారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన సామాగ్రిని సిద్ధం చేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. స్టేజ్ వన్ ఆర్ ఓ



అధికారులకు అవసరమైన ఫారాలు రిజిస్టర్లు ఇతర ఎన్నికల సామాగ్రిని అందజేసినందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహిం చేందుకు ముందస్తు చర్యలు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డిప్యూటీ ఎంపీడీవో, జి ఎస్ డబ్ల్యూ ఎస్ ఏ ఓ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా 59 వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలు



కలువాయి నవంబర్ 14 ప్రభాతవార్త : 59 వ జాతీయ గ్రంధాలయ వారోత్స వాలను మండలంలోని కుల్లూరు గ్రంధాలయం నందు శని వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల దినోత్స వం జవహర్‌లాల్ నెహ్రు జయ ంతిని పురస్కరించుకొని నెహ్రు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా గ్రందాలయ వారోత్స వాలలో భాగంగా వేడుకలను ఈనెల 14 నుండి 20 వ తేది వరకు జరిగే వారోత్స వాలలో ప్రతి రోజు ఒక కార్యక్రమం కలువాయి కుల్లూరు గ్రంధాలయాల నందు నిర్వహించనున్నట్లు గ్రంధాలయ ఇంచార్జి పి .సుధాకర్ తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యార్దిని, విద్యార్దులు, గ్రామస్తులు పాల్గోన్నారు.

ఆత్మకూరులో బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం

- రాబోయే పంచాయతీ ఎన్నికలకు సమాయత్తం



ఆత్మకూరు, నవంబరు14, ప్రభాతవార్త: ఆత్మకూరు భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ బలాబలాలు, పోటీకి అనుకూలమైన ప్రాంతాలు, ఎన్నికలపై ఆసక్తి కలిగిన అభ్యర్థుల వివరాలను సేకరించడం ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. పార్టీకి అనుకూలమైన అవకాశాలు ఉన్నచోట ఆసక్తి కలిగిన కార్యకర్తలు సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా పోటీ చేసేందుకు భారతీయ జనతాపార్టీ పూర్తి అవకాశాలు కల్పిస్తుందని నాయకులు ప్రకటించారు. ఈ సమావేశానిఇ భారతీయ జనతాకిసాన్ మోర్చా అఖిల భారత ఉపాధ్యక్షుడు, ఆర్టీసి జోనల్ చైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కర్ణాటి ఆంజనేయరెడ్డి, జిల్లా నాయకులు, మండల నాయకులు హాజరై కార్యకర్తలకు తగిన మార్గదర్శనం చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ముఖ్య కార్యకర్తలు పాల్గొని తమ తమ మండలాల్లో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పరిస్థితులు, పార్టీ అవకాశాలు, పోటికి ఆసక్తిచూపుతున్న వారి వివరాలను నాయకులకు తెలిపారు.

వైసిపి కావలి 36వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా ధారా అల్వినా



కావలి, నవంబర్14, ప్రభాతవార్త : వైసిపి కావలి నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆశీస్సులతో వైసిపి జిల్లా కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు సహకారంతో వైసిపి కావలి 36 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థినిగా బోగోలు మండలం మాజీ జెడ్పిటిసి సభ్యులు దారా సుధాకర్ కుమార్తె ధారా అల్వినా పోటీ చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆమె అభ్యర్థిత్వాన్ని శనివారం వెల్లడించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడారు.. యుపిఎస్సి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నటువంటి దారా అల్వినా రాజకీయాలలోనికి రావడం హర్షనీయమని, ఆమె ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తుంది అని, 36వ వార్డు ప్రజలు ఆమెను అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డుల ఇంచార్జ్‌లు మండలి కృష్ణారావు, పుల్ల శ్రీనివాసులురెడ్డి, తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కావలి మున్సిపల్ కౌన్సిలర్ అభ్యర్థులుగా నలుగురు నామినేషన్ దాఖలు




కావలి, నవంబర్14, ప్రభాతవార్త : గత ఏడు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కావలి మున్సిపల్ ఎన్నికల పురపోరుకు మొదటి రోజు అయిన శనివారం కౌన్సిలర్ అభ్యర్థులు గా నలుగురు నామినేషన్లను ఎన్నికల అధికారులకు దాఖలు చేయడం జరిగింది. తెలుగుదేశం పార్టీ తరపున 10వ వార్డుకు మలిశెట్టి విజయలక్ష్మీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 39వ వార్డుకు వేమిరెడ్డి ప్రసూన, పలక మల్లేశ్వరిలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున 38వ వార్డు నుండి నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి లు నామినేషన్లను ఎన్నికల అధికారికి దాఖలు చేయడం జరిగింది. చైర్మన్ అభ్యర్థులుగా ఎవరు కూడా మొదట రోజు నామినేషన్లను దాఖలా చేయలేదు. ఈ నామినేషన్ల ప్రక్రియను కావలి ఆర్డిఓ ఎలీషా బాబు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ లు పర్యవేక్షించడం జరిగింది. కావలి ఒకటవ పట్టణ ఇన్‌స్పెక్టర్ రంగనాథ్ గౌడ్ తన సిబ్బందితో నామినేషన్ వేసే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రశాంతంగా వేసుకునేందుకు గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది. నామినేషన్ దాఖలా చేసే సెంటర్‌కు అభ్యర్థితో పాటు ఇద్దరిని మాత్రమే అనుమతించడం జరిగింది. నామినేషన్ సెంటర్లో అభ్యర్థుల యొక్క నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. నామినేషన్ వేసే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేపట్టడం జరిగింది. తొలిరోజు ఎటువంటి సంఘటనలు జరగకుండా నామినేషన్ వేసే అభ్య ర్థులు ప్రశాంతంగా నామినేషన్లను దాఖలు చేసుకోవడం జరిగింది.

మున్సిపల్ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు



కావలి, నవంబర్14, ప్రభాతవార్త : బాలల దినోత్సవం సందర్భంగా కావలి తుమ్మలపెంట రోడ్డులోని మున్సిపల్ పాఠశాల నందు న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం మండల న్యాయ సేవాధికారిక సంస్థ చైర్మన్ ఎ.గీతావాణి ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిష నల్ జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.విక్రమ్ సిన్హా పాల్గొని మాట్లాడారు.. పాఠశాల స్థాయి నుండి బాలబాలికలు క్రమశిక్షణతో నడుచుకుంటూ, ఉన్నత విద్యను అభ్యసించాలని కోరారు. 12 సంవత్స రాలలోపు పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. ప్రతి విద్యార్థులు తమ యొక్క వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తు పాఠశాల స్థాయి నుంచి ఉన్నత చదువులకు పునాదులు వేసుకోవాలన్నారు. ఉద్యోగాలు పొంది ఉపాధ్యా యులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకొని వచ్చి సమాజ శ్రేయస్సుకు పాటుప డాలన్నారు .లీగల్ ఎయిడ్ మెంబర్ ఐ.సాయి ప్రసాద్, లోక్ అదాలత్ సభ్యులు యం. మాలకొం డారెడ్డి, మహిళా న్యాయవాది వి.విజయలక్ష్మీ, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, విధ్యార్లులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సహకరించండి

- డీఎస్పీ కేవీ నరసింహామూర్తి



కోట, నవంబర్14, ప్రభాతవార్త : ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించుకోవాలని గూడూరు డీఎస్పీ కేవీ నరసింహామూర్తి పిలుపునిచ్చారు. శనివారం కోట క్రాస్ రోడ్డు నుండి కోట పురవీధుల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సత్యానారాయణమూర్తి విలేకర్లతో మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో డ్రోన్ వినియోగంతో పాటు పలువురు పోలీసులు ఫోన్లలోనే అక్కడ ఏమి జరిగిన వీడియో చిత్రీకరించి పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు పంపేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. దీంతో క్షణాల్లో సమీపంలోని ఉన్న పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడికి చేరుకునేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అన్ని పంచాయతీల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎక్కడా కూడా గుంపులు గుంపులుగా ఉండకూడదని చెప్పారు. పోలీసు యాక్ట్ అమల్లో ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఆయన వెంట సీఐ వెంకటరావు, ఎస్సై పవన్ కుమార్ ఉన్నారు.

జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివి



కోవూరు, నవంబం14 ప్రభాతవార్త : భారతదేశ తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులో ఉన్న పచ్చిపాల శంకర్‌రెడ్డి శాఖా గ్రంథాలయంలో శనివారం 59వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆ మహనీయుని చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయడం ద్వారా అనేక విజ్ఞాన విషయాలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుం దన్నారు. గంథాలయ బాండాగారి జె. సురేంద్రరెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థుల కోపసం ఇంటర్, డిగ్రీ పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. విజ్ఞానానికి విరామకాల సద్వినియోగానికి విశేష జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు మానవ జీవితంలో విడరాని సంబంధం కలిగి ఉన్నాయన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె. భారతి, ఉపాధ్యాయులు కె. రజిత, ఎస్‌కే సబీరా, పద్మరేఖ, విశ్రాంత ఉద్యోగులు ఆర్. సత్యనారాయణ, జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి, పలు సూచనలు చేశారు.

సంక్రాంతి తరువాత వైసీపీలో భారీ ప్రక్షాళన

కోట, నవంబర్ 14, ప్రభాతవార్త : నెల్లూరు జిల్లాలోని ఇటీవల ఎంపీటీసీ, జడ్పీటీసీ ఫలితాలపై వైసీపీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి సంక్రాంతి తరువాత పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిసింది. జిల్లాలోని గూడూరు నియోజకవర్గంలోని పార్టీలో కొంత మంది క్రింది స్థాయి నాయకులకు వెన్నుపోటు పొడిచి పార్టీ ఓటమికి కారణమయ్యారని, కొంత మంది పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అప్పులు చేసి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తే తమకు ఇన్‌చార్జ్‌లు సహకరించలేదని ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ ఎన్నికల అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు 30మంది ఇన్‌చార్జిలపై వేటు వేయనున్నట్లు సమాచారం.

బియ్యం ధరలను తక్షణం నియంత్రించాలి

- గ్రామీణ ప్రాంతాల్లో కిలో బియ్యం రూ.120 వరకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయం - ప్రభుత్వ సమావేశాలు ప్రకటనలకే పరిమితం.. ధరల నియంత్రణలో చర్యలు శూన్యం..! - రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షాన్వాజ్



నెల్లూరు అగ్రికల్చర్, నవంబర్14, ప్రభాతవార్త : ప్రభుత్వం తక్షణమే స్పందించి బియ్యం ధరలను నియంత్రించడంతోపాటు సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన బియ్యం లభించేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షాన్వాజ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన రైతు సంఘం నేతలతో కలిసి నెల్లూరులోనే సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైస్ మిల్లర్లు బియ్యం ధరలను ఇష్టానుసారంగా పెంచుతూ సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో కిలో బియ్యాన్ని రూ.120 వరకు బ్లాక్ మార్కె ట్‌లో విక్రయిస్తున్న పరిస్థితి నెలకొందని ఆరోపించారు. బియ్యం ధరల నియంత్రణపై ప్రభుత్వం సమా వేశాలు నిర్వహించి ధరలు తగ్గించాలని సూచించినప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ సమావేశాలు, ప్రకటనలు కాగితాలకే పరిమితమ వుతున్నా యని, ఆచరణలో రైస్ మిల్లర్లపై నియంత్రణ లేకపోవడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రోజువారీ కూలి పనులు చేసుకుని జీవించే పేద, మధ్యతరగతి కుటుంబాలకు బియ్యం ధరలు భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న ప్రజలకు బియ్యం ధరల పెరుగుదల మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు.

ప్రభుత్వానికి షేక్ షాన్వాస్ ప్రధాన డిమాండ్లు:

1. గ్రామీణ ప్రాంతాల్లో బియ్యం విక్రయ ధరలపై తక్షణమే విచారణ జరపాలి.
2. కిలో బియ్యం రూ.120 వరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేయాలి.
3. బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలను అరికట్టాలి.
4. రైస్ మిల్లులు, బియ్యం వ్యాపార కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి.
5. ప్రభుత్వం ప్రకటించిన ధరలపై క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.
6. అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలని షాన్వాస్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.లీలా మోహన్, గుత్తా రామకృష్ణ, షేక్ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

కొండ బిట్రగుంట దేవస్థానానికి విరాళం



బిట్రగుంట నవంబర్ 14 ప్రభాతవార్త: బోగోలు మండలం కొండ బిట్రగుంట లోని బిళకూట క్షేత్రంలో వెలిసి ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు పరిశీలించి నెల్లూరుకు చెందిన కావేటి దినేష్ రెడ్డి శనివారం స్వామివారిని దర్శనం చేసుకొని లక్ష పదివేల రూపా యలు చెక్కును ఆలయ కార్యని ర్వాహణాధికారి అరవ రాధాకృష్ణకు విరాళంగా సమర్పించారు. దీంతో దాతను ఆలయ ఈఓ అభినందించారు

నేటినుండి గ్రంధాలయ వారోత్సవాలు

కలిగిరి, నవంబర్14, ప్రభాతవార్త; జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో బాగంగా నేటినుండి కలిగిరి శాఖ గ్రంధాలయ వారోత్స వాలు జరుగుతున్నట్లుకలిగిరి, గ్రంధాలయ శాఖాధికారి ఆత్మకూరు సురేంద్ర బాబు తెలిపారు. ఈగ్రంధాలయ వారోత్స వాలలో బాగంగా ఈనెల 17,18 తారీకుల్లో విధ్యార్దులకు వ్యాసరచన ,చిత్ర లేఖన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి ఈనెల 20వ తేదీన గ్రంధాలయ వారోత్స వాలు ముగింపు సందర్బంగా విధ్యార్దులకుబభుమతులు ప్రాదనం చేయు కార్యక్రమం నిర్వహించనున్నటుల కలిగిరి గ్రంధాలయ శాఖాధికారి తెలిపారు.

పంచాయితీ లకు నేటినుండి నామినేషన్లు

కలిగిరి, నవంబర్14, ప్రభాతవార్త; కలిగిరి మండలంలో నేటినుండి అన్నిపంచాయితీలకు సర్పంచిలు, వార్డు సబ్యులకు ఎన్నికల నామినేషన్లు నిర్వహించనున్నట్లు కలిగిరి మండల యంపిడిఓ ప్రత్యూష తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలనుండి సాయంత్రం 5గంటల వరకూ నామినేషన్ల పక్రియ ఉంటుందన్నారు. ఈనెల 15నుండి 17 వరకూ నామినేషన్లు శ్వీకరించబడుతాయనితెలిపారు. కలిగిరి మండలంలోని కలిగిరి, క్రిష్ణారెడ్డిపాళెం, పెద్దకొండూరు, లక్ష్మీపురం, అనంతపురం సెంటర్లనుండి నామినేషన్లు శ్వీకరించడం జరుగుతుం దన్నారు. 1లక్ష్మీపురం(కందులవారిపాలెం)పరిదిలోలక్ష్మీపురం, కందులవారాపాలెం, పరికోట. క్రిష్ణారెడ్డిపాళెం పరిదిలో క్రిష్ణారెడ్డిపాలెం, చిన్న అన్నలూరు, తూర్పు దూబగుంట, తెల్లపాడు. కలిగిరి పరిదిలో నాగసముద్రం ,వీర్నకొల్లు, కలిగిరి, గంగిరెడ్డిపాళెం, ఏపినాపి. పెద్దకొండూరు పరిదిలోరావులకొల్లు, పెద్దకొండూరు, పోలంపాడు, క్రాకుటూరు, కుమ్మరకొండూరు. లనంతపురం పరిదిలో అనంతపురం, వెలగపాడు, కావలి ముస్తాపురం, తూర్పుగుడ్లదొన, పడమర గుడ్లదొన ,ఎరుకుల రెడ్డిపాలెం గ్రామాలు ఉంటాయన్నారు.

సిరా గుర్తుపై ఓటర్లకు అవగాహన కల్పించాలి

కోట, నవంబర్14, ప్రభాతవార్త : జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటర్ల ఎడమ చేతి చిటికెన వేలికి చెరగని సిరా గుర్తు వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను జారీ చేసింది. ఈనెల 5వ తేదీన జిల్లాలో నిర్వహించిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎడమ చేతి చూపుడు వేలికి చెరగని సిరా గుర్తువేశారని వివరించారు. ఇంకా ఆ సిరా గుర్తులు చెరిపిపోవకపోవడంతో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు ఎడమ చేతి చూపుడు వేలికి చెరగని సిరా గుర్తు వేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించినట్లు అధికారులుతెలిపారు. ఈ మార్పుపై పోలింగ్ సిబ్బందికి స్పష్టమైన అవగాహనకల్పిం చడంతో పాటు ఓటర్లకు కూడా ముందస్తుగా తగిన ప్రచారం నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

కోటలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



కోట, నవంబర్14, ప్రభాతవార్త : కోట మండలంలోని జరుగుమల్లి, ఉత్తమనెల్లూరు, గూడలి, అల్లంపాడు, ,వెంకన్నపాలెం, కొత్తపట్నం, కర్లపూడి తదితర 71 ప్రాధమిక పాఠశాలలో శనివారం ఘనంగా బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముందుగా నెహ్రు చిత్రపటానికి ఎంఈఓ దారా మస్తానయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, విద్యా ప్రాముఖ్యత, బాలల భద్రత, రక్షణ, ఆత్మవిశ్వాసం, ఉన్నత లక్ష్యాల సాధనపై అవగాహన కలిగిఉండా లన్నారు. ప్రతి బాల బాలికలకు సమాన అవకాశాలు కల్పిస్తూ వారి హక్కులను గౌరవించి సురక్షితమైన వాతావరణంలో వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ శాఖలు, తల్లిదండ్రులు, సమాజం సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి, మనోహర్, రజ్యా, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఏ.ఎస్.పేట మండలం, అనుమసముద్రం పేట గ్రామంలోని శ్రీశ్రీశ్రీ హజరత్ సయ్యద్ ఖాజా నాయబ్ రసూల్ వారి దర్గాకు వచ్చు దినసరి వాహనములకు స్టాండ్ ఫీజు వసూలు చేసుకునే హక్కును వేలంపాట జరిగిన తేదీ నుండి 13-08-2027 వరకు మరియు 14-09-2027 నుండి 31-10-2027 వరకు రుసుము వసూలు చేసుకునే హక్కును తేదీ: 17-11-2026 మంగళవారం ఉదయం 11.00 గంటలకు అనుమసముద్రంపేట గ్రామపంచాయతీ కార్యాలయం నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఆసక్తి గలవారు ఈ వేలంపాట ధారావత్తు రుసుము చెల్లించి గ్రామపంచాయతీచే విధింపబడిన షరతులు మరియు నిబంధనలు పాటించి వేలంపాట నందు పాల్గొనవచ్చును.

వ.నం.	వివరములు	ధారావత్తు రుసుము
1.	దర్గాకు వచ్చు దినసరి వాహనములకు స్టాండ్ ఫీజు వసూలు చేసుకునే హక్కు తేది: 17.11.2026 నుండి 13.08.2027 వరకు మరియు తేది. 14.09.2027 నుండి 31.10.2027 వరకు అనగా (11 నెలలకు) గాను	రూ.20,000/-

సం/- పంచాయతీ కార్యదర్శి

అనుమసముద్రంపేట గ్రామపంచాయతీ, ఏ.ఎస్.పేట మండలం

సాంప్రదాయబద్ధంగా నాగ పంచమి పూజలు

- భారీస్థాయిలో అన్నదానం




కోవూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : కోవూరులోని చిన్న పడుగుపాడు ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ నాగేంద్రస్వామి పుట్ట వద్ద శనివారం నాగపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ నిర్మాణకర్తలు గుండు బోయిన మస్తానయ్య దంపతులు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పుట్ట వద్ద పూలంగి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఈ పుట్టను బాగు చేయడమే కాకుండా అన్నదాన కార్యక్రమాన్ని నిరాటంకంగా తమ కుమారుడు ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ఆ స్వామివారి చల్లని చూపు ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రసాద్ యాదవ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో, గాదిరాజు సుధాకర్‌రావు, హరిరెడ్డి,, డీలర్స్ అసోసియేషన్ నాయకుడు కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి



కోవూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : సాంఘిక సంక్షేమ బీసీ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డాక్టర్ నిరంజన్ అన్నారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ బీసీ బాలబాలికల వసతి గృహ సముదాయంలో శనివారం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన కలిగే వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల సంక్షేమాధికారులు తగు చొరవ తీసుకోవాలన్నారు. వసతి గృహాల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారులు సుభాషిణి, సుమలత, పద్మజ, సుప్రజ, సీహెచ్‌వో ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రియాంక, నాగమణి, ఏఎన్‌ఎంలు ఉమాదేవి, స్రవంతి, సుభాషిణి, ఆరోగ్య సహాయకులు సురేష్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

ఉత్సాహం కలిగించిన బాలల దినోత్సవ వేడుకలు



కోవూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పర్వీన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ తొలి ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ అనేక సేవలు చేశారని, అటువంటి మహనీయుని జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు.. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సొసైటీ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్ పరిశీలన



కోవూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : త్వరలో సహకార శాఖ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నోడల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప కోవూరులోని పీఆర్‌ఎన్ బాలికోన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను నిశిత పరిశీలన చేపట్టారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉన్నాయా. మరుగుదొడ్లు, ఎలక్ట్రిసిటీ తదితర వసతులు ఉన్నాయా అనే విషయాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు. రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ పరిశీలన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పడుగుపాడు సహకార సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా కార్తీక శుక్రవారం పూజలు





కోవూరు, నవంబర్ 14 ప్రభాతవార్త : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షిసమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శనివారం కార్తీక మాస పర్వదినం సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రధాన అర్చకులు సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్దంగాభక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహిం చుకుని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం భక్తుల సహకారంతో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మురళి స్వామి, వంశీస్వామి, శేఖర్‌స్వామి, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రంధాలయంలో ప్రారంభమైన గ్రంధాయ వారోత్సవాలు



రాపూరు, నవంబరు 14, ప్రభాతవార్త : మండల కేంద్రమైన రాపూరులోని ప్రభుత్వ గ్రంధాలయంలో శనవారం 59వ గ్రంధాలయ వారోత్స వాలు ఘనంగా ప్రారంబమైనాయి. ఇందులో బాగంగా ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపతానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంధాలయాల వల్ల కలిగే లాబాలను విద్యార్ధులకు పాఠకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రందాలయాధికారి అంజయ్య, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాద్యాయులు ప్రసాద్, తదితరులున్నారు.







శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో ఘనంగా బాలల దినోత్సవం



బుచ్చి నవంబర్ 14 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో శనివారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీ చైర్‌పర్సన్ దొడ్ల విజయలక్ష్మీ, దొడ్ల కోదండరామిరెడ్డి, మూడో వవార్డు కౌన్సిలర్ బెలూం పద్మ, మల్లారెడ్డి వ్యవహారించారు. చిన్నారుల వేషదారణలు చూసి అబ్బురపడ్డారు. ఈ కార్యక్రమంలో భాగంగా చైర్‌పర్సన్ విద్యార్థులతో కొద్ది సేపు ముచ్చటించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ నేలనూతలశ్రీదర్ మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం స్వచ్ఛ నగరంగా తయారు కావాలని దానికి పుర ప్రముఖులు అందరికి ఒక కరపత్రాన్ని అందజేయాలని చైర్‌పర్సన్ ద్వారా మన నగరాన్ని మనమే బాగు చేసుకుందాం అనే కరపత్రాన్ని విడుదల చేశారు. పిల్లల మనజాతి సంపద అని వారు ఆరోగ్యంగా విద్యావంతులైతే దేశం బాగుపడుతుందని దాని కోసం గోపాలకృష్ణయ్య స్కూల్ పాఠశాల తమ విద్యార్థులకు నిరంతరం మంచి కార్యక్రమాల ద్వారా మంచి చదువులు అందిస్తుందని ఆమె అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిఫల్ సురేఖ, గిరిజ, అనిత, విజయలక్ష్మీ, మాధవి, సురేఖ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనంతరం టి.జి పద్మనాభం (విశ్రాంతి ఇస్రో ఉద్యోగి) చే మ్యాజిక్ షో నిర్వహించారు. అనంతరం అతిధులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

శ్రీ వివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బాలలకు ఎగ్జిబిషన్ ప్రదర్శన



బుచ్చి నవంబర్ 14 ప్రభాతవార్త బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ప్రైమరీ విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్బంగా ప్రత్యేకంగా వారికి పాఠశాల ప్రైమరీ ఇంచార్జి హన్వితా ఎగ్జిబిషన్ చూపించారు. విద్యార్థులను పార్కుకు తీసుకొని వెళ్ళి పక్షులు, పార్కులు వున్న చిన్నచిన్న జంతువులను చూపించారు. అవి చూసి విద్యార్థులు కేరింతలు కొట్టారు. ఈ సందర్బంగా హన్వితా మాట్లాడుతు నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్బంగా వారి సంతోషం కోసం తమ పాఠశాలలో ప్రతి సంవత్సరం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల సూపర్నెంట్‌ను అభినందించిన మంత్రి "ఆనం"



ఆత్మకూరు, నవంబరు14, ప్రభాతవార్త: ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు స్వచ్ఛ ఆంధ్ర పుంస్కారం లభించడంతో రాష్ట్ర దేవాదాయ - ధర్మా దాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు చేతుల మీదుగా స్వచ్చ ఆంధ్ర పురస్కారాన్ని అందుకున్న ఆత్మకూరు జిల్లా వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ కిరణ్‌తోపాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ఆసుపత్రి సిబ్బందిని మంత్రి ఆనం రామనార్యాణరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడం, పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ కనపరచడం ద్వారా ఈ పురస్కారాన్ని సాధించడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఇదే స్పూర్తితో ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు.

స్వల్పకాలిక పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి



నెల్లూరు అగ్రికల్చర్, నవంబర్14, ప్రభాతవార్త ప్రస్తుత 2026 రబీ సీజన్‌లో స్వల్పకాలిక పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించి ఆ దిశగా ప్రయత్నాలు సాగించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించారు. శనివారం నెల్లూరు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ సాంకేతిక, విస్తరణ(ట్రైనింగ్ విజిట్) సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు పంటల సాగులో అనుసరించాల్సిన మెలుకువలు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, స్వల్ప కాలిక పంటల సాగుపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ డి.ఆర్.సి డిడిఏ వి.సుమలత మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించి చైతన్యం చేయాలని తెలిపారు. ఏఆర్ఎస్ ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ యు.వినీత మాట్లాడుతూ.. ఈ రబీలో ప్రత్యామ్నాయ పంటలైన పెసర, జొన్న, శనగ, మినుము సాగు చేయవద్దని సూచించారు. కెవికె ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.వి సరళ రైతులకు పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. స్వల్ప కాలిక వరి రకాలు, 120 రోజుల వ్యవధిలో పంట చేతికి వచ్చే స్వల్పకాలిక వరి రకాల సాగును ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు రైతులు నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల ఏడిఏలు, అన్ని మండలాల ఎంఏఓ లు పాల్గొన్నారు.

ఎన్నికల విషయంలో నిమగ్నమైన అధికారులు




కోవూరు, నవంబర్14, ప్రభాతవార్త కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సైతం ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో అన్ని కార్యాలయాల ఉద్యోగులు రానున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నిమగ్నమయ్యారు. పంచాయతీరాజ్ కమిషన్, ఎన్నికల కమిషన్ ఇచ్చిన సూచనల మేరకు ఇప్పటికే కుల విభజన, వార్డు విభజన, డ్రాఫ్‌విభజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే మండలంలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శితో పరిశీలించి వారికి సంబంధించిన వివరాలను పూర్తిగా నివేదిక రూపంలో తయారు చేసి ఎన్నికల సంఘానికి నివేదించారు. శనివారం డిప్యూటీ ఎంపీడీవో సురేష్, కార్యాలయ పర్య వేక్షకులు ఉషారాణితో రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రత్యేకంగా చర్చించారు. శనివారం సెలవు దినం అయినా అధికారులు కార్యాలయంలో ఉండి ఎన్నికలకు సంబంధించిన వివరాలను పరిశీలించడం గమనార్హం.

ఎమ్మెల్యే సమక్షంలో తెదేపాలో చేరిన వైకాపా నాయకులు !



కొడవలూరు, నవంబరు 14 ప్రభాతవార్త: మండలంలోని మిక్కిలింపేట గ్రామానికి చెందిన పలువురు వైకాపా నాయకులు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో వారికి పసుపు కండువాలు కప్పి తెదేపాలోకి ఆహ్వానించారు. మిక్కిలింపేటకు చెందిన కోడూరు నవీన్‌కుమార్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి నేతృత్వంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెల్లో మంతనాల జోరు ..సర్పంచ్ పీఠాలపై కన్ను



కోట, నవంబర్ 14 ప్రభాతవార్త గ్రామాల్లో ఎన్నికల సందడి ప్రారంభమైంది. ప్రాదేశిక ఎన్నికలు ముగి యడంతో మండలంలోని అన్ని పంచాయతీల్లో రాజకీయ పార్టీల కన్ను పంచాయతీలపై పడింది. సర్పంచ్, వార్డుసభ్యుల పదవులను దక్కించుకునేందుకు ఆశావహులు పావులు కదుపుతున్నారు. కోట మండలంలో 21 గ్రామ పంచాయతీలకు ఈ నెల 29న ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో కోట మండలంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గ్రామ ప్రథమ పౌరుల పీఠాలను దక్కించుకునేందుకు పోటీ ఎక్కువగా ఉండటంతో ప్రస్తుత ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఇప్పటికే మండల పోరులో సత్తా చాటిన పార్టీలు పంచాయతీల్లోనూ ఆధిపత్యం ప్రదర్శించాలని భావిస్తున్నాయి. అందులో భాగంగా గ్రామాల్లో బలమైన నాయకత్వం ఉన్న వారికే మద్దతు తెలిపి బరిలో నిలిపేలా ఆయా పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఇటీవల ముగిసిన ప్రాదేశిక ఎన్నికల ఫలితాలు పంచాయతీ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆయా గ్రామాల్లో ఏ పార్టీకి ప్రజాదరణ ఉందో ఈ ఫలితాలు తేటతెల్లం చేశాయి. గెలిచిన ఎంపీటీసీ సభ్యులు తమ పరిధిలోని గ్రామ పంచాయతీలపై దృష్టి సారించ నున్నారు. ఓటమి పాలైన నేతలు కూడా పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు అభ్యర్థుల ఎంపికలో కీలకం కానున్నాయి. సర్పంచ్ అభ్యర్థిత్వాన్ని తమకే ఇవ్వాలని ఇప్పటికే కోట నుంచి పలువురు నాయకులు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు తెలు స్తోంది. గ్రామ నాయకులతో సంప్రదింపులు సాగిస్తున్నారు. కేశవరంలో అధికార పార్టీ తరపున యువ పారిశ్రామికవేత్త రాజేంద్రబాబును రంగంలోకి దింపేందుకు అక్కడ అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కేశవరం పంచాయతీని తిరిగి సొంతం చేసుకునేందుకు ఆ గ్రామ నాయకుడు చీరా గురుస్వామి సర్పంచ్ అభ్యర్థిని నిలబెడుతున్నట్లు సమాచారం. చిట్టేడు పంచాయతీలో కూడా హోరా హోరీగా ఇరు పార్టీల అభ్యర్థులు తలపడనున్నారు. ఊనుగుంటపాళెం, కొత్తపాళెం, కొత్తపట్నం, వంజివాక, పుచ్చపల్లి, అల్లంపాడు, తదితర గ్రామాల్లో కూడా నువ్వానేనా అన్నట్లుగా పోటీ జరగనుంది. ఈ ఎన్నికల్లో స్థానిక సమస్యలు, వ్యక్తిగత పరిచయాలు, సామాజిక సమీకరణలు కీలక పాత్ర వహించనున్నాయి. ప్రాదేశిక ఎన్నికల్లో వచ్చినఫలితాలే పంచాయతీ ఎన్నికల్లోనూ పునరావృ తమవుతాయా? లేక గ్రామ స్థాయి రాజకీయాలు కొత్త మలుపు తీసుకొస్తాయా? అనేది ఆసక్తికరంగా మారింది.

పల్లెల్లో డీఆర్ పర్యటన



కోట, నవంబర్ 14, ప్రభాతవార్త వైసీపీ రాష్ట్ర నాయకుడు కొడవలూరు ధనంజయరెడ్డి శనివారం మండలంలోనిగూడలి, రాజుపాలెం, చంద్రశేఖరపురం, ఊనుగుంట పాలెం, రుద్రవరం, చిట్టేడు, మద్దాలి, మద్దాలి కండ్రిగ, తదితర గ్రామాల్లో సుడిగాలి పర్యటన జరిపారు. పంచాయతీ ఎన్నికల్లో వైసీపీ బలపరిచే అభ్యర్థులు గెలుపు దిశగా అడుగులు వేయాలని సూచించారు. గెలుపు గుర్రాలనే బరిలో ఉంచాలని ఆయన గ్రామాల్లోని వైసీపీ నా యకులకు, కార్యకర్తలకు దిశానిర్ధేశం చేశారు. ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో ధనంజయరెడ్డి వ్యూహాత్మకంగా తన సెగ్మెంట్లను గెలిపించుకున్న విషయం తెలిసిందే. పంచాయతీ ఎన్నికల్లో కూడా అదే సమన్వయంతో అందరినికలుపుకుని పోతూ వైసీపీమద్దతు దారులను గెలిపించుకోవాలని కోరారు. ఆయన వెంటశివరామనాయుడు, నాగరాజు, రమేష్, పుట్టానారాయణ, శేఖర్, కోటారెడ్డి, నాగూర్‌యాదవ్, ఉన్నారు.

విపిఆర్ దంపతులను కలిసిన మాలేపాటి లోకేష్, నరేష్





కావలి, నవంబర్14, ప్రభాతవార్త నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ని, కోవూరు శాసన సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ని నెల్లూరులోని వారి కార్యాలయంలో స్వర్గీయ మాలేపాటి సుబ్బానాయుడు కుమారుడు మాలేపాటి లోకేష్, మాలేపాటి రవీంద్ర నాయుడు కుమారుడు మాలేపాటి నరేష్ మర్యాద పూర్వకంగా కలవడంజరిగింది. నూతనంగా ఎన్నికైన దగదర్తి మండలం, చెన్నూరు ఎంపీటీసీ పందల రమణమ్మ, దగదర్తి-2 ఎంపీటీసీ యాకసిరి సుజాత, తురిమెర్ల ఎంపిటిసి అల్లం లక్ష్మీ ప్రవళ్లికలకు విపిఆర్ దంపతులు అభినందనలు తెలిపారు. దగదర్తి మండలంలో ఇదేవిధంగా రాబోయే పంచాయితీ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయకేతనం ఎగురవేయాలని మాలేపాటి లోకేష్, మాలేపాటి నరేష్ లకు సూచించారు.

బీజేపీ గూటికి పసుపులేటి సుగుణమ్మ


- పార్టీలోకి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి



కావలి, నవంబర్14, ప్రభాతవార్త భారతీయ జనతా పార్టీలో కావలి నియోజకవర్గానికి చెందిన పసుపులేటి సుధాకర్ సతీమణి పసుపులేటి సుగుణమ్మ శనివారం నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర నేతలు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరుల సమక్షంలో జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డిపార్టీ కండువాను కప్పి ఆమెను సాదరంగా ఆహ్వానించడం జరిగింది. ఆమెతో పాటు కావలికి చెందిన పలువురు పసుపులేటి అనుచరులు బీజేపీ లో చేరారు. ఈ సందర్భంగా సొంతగూటికి తాము తిరిగి వచ్చామని పసుపులేటి సుగుణమ్మ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసి పని చేద్దామని జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర నేతలు సూచించారు. కావలి మున్సిపల్ చైర్ పర్సన్ రేసులో పసుపులేటి సుగుణమ్మ ఉన్నట్లు వినికిడి. ఈ క్రమంలో బిజెపిలో సుగుణమ్మ చేరడం పట్ల కావలి పట్టణంలో చర్చనీయాంశం అయింది.

వైసిపి తీర్థం పుచ్చుకున్న పెనుమల్లి అశోక్

- పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి



కావలి, నవంబరు 14 ప్రభాతవార్త: కా వలి పట్టణంలోని 40వ వార్డు తెలు గుదేశం పార్టీ నాయకుడు పెనుమల్లి అ శోక్ శనివారం టిడిపి పార్టీని వీడి వైసి పి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కావలి నియోజకవర్గ వైఎ స్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెనుమల్లి అశోక్ మా ట్లాడారు తనను మళ్లీ వైసిపి పార్టీలోకి ఆహ్వానించిన రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డిని, వార్డులో కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను అత్యధిక మెజార్టీతో గెలిచి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డికి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కానుకగా అందిస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కుందుర్తి శ్రీనివాసులు, హహుల్ హమీద్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరువలేనివి





కోవూరు, నవంబం14 ప్రభాతవార్త : కోవూ రులోని కోనమ్మ తోటలో ఉన్న న్యూలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాధ్యమ పాఠ శాలలో శనివారం బా లల దినోత్సవాన్ని పురస్కరించుకుని కరస్పాం డెంట్ నందకిషోర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూభారతదేశ తొలి ప్రధానిగా జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదవుకుని మంచి అలవాట్లతో బాధ్యత గల పౌరులుగా ఎదగాలని సూచించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు ఆటలపోటీలు, నృత్య రూపకాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఆ టల పోటీలు, నృత్య రూపకాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వలన విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పాఠశాల డైరెక్టర్ వై. అనిత బాలల దినోత్సవ ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు గెలుపొందిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజే తలకు పాఠశాల యాజమాన్యం బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు.. పాఠశాల ప్రాధానోపాధ్యాయులు కోటయ్య, ఇన్‌చార్జులు బాల సుబ్రహ్మణ్యం, విజ యలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఫ్యాన్ గాలి ఆగింది.. పసుపు జెండా ఎగిరింది!

: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సమక్షంలో పెద్దపాళెం వాసుల చేరిక



విడవలూరు, నవంబరు 14 ప్రభాతవార్త మండలంలోని ఊటుకూరు పెద్దపాళెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకున్నారు. టీడీపీ నాయకుడు మీనంగారి బాబు ఆధ్వర్యంలో మేకలవెంకటేశ్వర్లు, కొండూరు వెంకటేశ్వర్లు, అక్కయ్యగారి వెంకటేశ్వర్లు, మీనంగారి శంకర్, కోడి ప్రసాద్, మేకల కిషోర్, కంజి వెంకటరమణయ్య, మీనంగారి లక్ష్మయ్య, కునేంగారి సురేష్, కొండూరు వెంకటరమణ, మేకల రాము, మేకల రామలింగయ్య తదితరులు 20 కుటుంబాల సభ్యులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తామని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, రానున్న పంచా యతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఎనెల్ హాస్పిటల్స్‌లో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం



నెల్లూరు, నవంబర్ 14, ప్రభాతవార్త – వైద్యం: ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా శనివారం నెల్లూరులోని ఎనెల్ హాస్పిటల్స్‌లో మధుమేహ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది ప్రపంచ మధుమేహ దినోత్సవ థీమ్ మధుమేహంపై ముందస్తు చర్యలు – మెరుగైన ఆరోగ్యానికి మార్గం ఈ సందర్భంగా జనరల్ మెడిసిన్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ మధుమేహ వ్యాధి రావడానికి గల కారణాలు, వ్యాధి వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దీర్ఘకాలికంగా ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి అనే అంశాలపై వివరించారు. మధుమేహం రావడానికి వంశపారం పర్య కారణాలతో పాటు మన రోజువారీ జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం వంటి అంశాలు కూడా కారణమవుతాయని వివరించారు. ముఖ్యంగా కుటుంబంలో మధుమేహ చరిత్ర ఉన్నవారు ముందుగానే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే మన రోజువారీ ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవడం, పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం, ప్రాసెస్డ్ ఫుడ్స్‌కు దూరంగా ఉండడం, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయడం ద్వారా మధుమేహం వచ్చే ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చని, వ్యాధి ఉన్నవారు కూడా మెరుగైన నియంత్రణలో ఉంచుకోవచ్చని తెలిపారు. మధుమేహం వచ్చే ముందు లేదా ప్రారంభ దశలో శరీరం కొన్ని సంకేతాలను చూపిస్తుందని, తరచుగా దాహం వేయడం, ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేయడం, కారణం లేకుండా బరువు తగ్గడం, అలసట వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వైద్యుల సూచన మేరకు మందులు క్రమం తప్పకుండా వాడటం, రక్తంలో చక్కెర స్థాయిలను ఎప్పటికప్పుడు పరీక్షించు కోవడం, ఆహార నియమాలు పాటించడం ద్వారా మధుమేహం వల్ల వచ్చే గుండె, మూత్రపిండాలు, కంటి సమస్యలు వంటి దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చని డాక్టర్ హరికృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎనెల్ హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది, రోగులు, వారి సహాయకులు పాల్గొని మధుమేహ నివారణ, నియంత్రణపై అవగాహన పొందారు.

కొడవలూరు మండలంలో 'కూటమి' తుఫాన్!

ఉత్తరాన పుట్టి.. పడమటి వైపునకు దూసుకుపోతున్న వర్గపోరు

కమ్మపాలెంలో మామఅల్లుడు.. మిక్కిలింపేటలో అన్నదమ్ముల మధ్య రగులుతున్న రాజకీయం!

సర్పంచ్ అభ్యర్థుల ఖరారు వేళ రగడ.. వైకాపాకు కలిసి వస్తుందా?

కొడవలూరు, నవంబర్ 14 ప్రభాతవార్త:మండల రాజకీయాల్లో కూటమి నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు ఒక్కసారిగా తారాస్థాయికి చేరాయి. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా సాగుతున్న ఈ పరిణామాలు అధికార కూటమి శ్రేణుల్లో తీవ్ర కలవరం రేపుతున్నాయి. కమ్మపాలెంలో ప్రారంభమైన వర్గపోరు క్రమక్రమంగా మండలంలోని మిగతా ప్రాంతాలకు సైతం ఒక తుఫాన్ లా విస్తరిస్తోంది. చుట్టాల మధ్యే కుంపటి రగులుతున్న నిప్పులు.. మండలంలో సర్పంచ్ అభ్యర్థుల ప్రచారం రసవత్తరంగా సాగుతున్న వేళ, కుటుంబ సంబంధాలే బద్ధ శత్రువులుగా మారుతున్నాయి. కమ్మపాలెంలో మామ అల్లుడికి, అలాగే మిక్కిలింపేటలో అన్నదమ్ములకు మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరింది. ఈ వర్గపోరు నిప్పులపైనే అభ్యర్థులు తమ ప్రచారాన్ని కొనసాగిస్తుండడం గమనార్హం. ఉత్తరాన ఉద్భవం పడమటికి విస్తరణ:మండలానికి ఉత్తర దిక్కున ఉన్న కమ్మపాలెంలో మొదలైన ఈ విభేదాలు, ఈదురుగాలుల వలె పడమటి దిక్కులోని మిక్కిలింపేటకు చేరుకుని, అక్కడి నుంచి యల్లాయపాలెం వైపు దూసుకెళ్తున్నాయి.

22పంచాయతీలకు టెన్షన్:ఈ అంతర్గత కలహాల తుఫాన్ ప్రభావం కొడవలూరు మండలంలోని మిగిలిన 22 గ్రామ పంచాయతీలపైనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని కూటమి ద్వితీయ శ్రేణి నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా శిబిరంలో ఆశలు ప్రజల్లో జోరుగా చర్చ:కూటమిలో నెలకొన్న ఈ గ్రూపు రాజకీయాలను ఆసరాగా చేసుకుని, వైకాపా దీటుగా ఎదురు నిలబడి సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంటుందా? లేక ఈ తుఫాన్‌ను కూటమి పెద్దలు కట్టడి చేయగలుగుతారా? అని ప్రస్తుతం మండల వ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.